



ఎవరి ధీమా వారిదే

- గెలుపుపై అంచనాల్లో అభ్యర్థులు
- మెజారిటీ స్థానాల్లో విజయం మాదే అంటున్న టీడీపీ
- మళ్లీ గత ఫలితాలే వస్తాయంటున్న వైసీపీ నాయకులు
- రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూంకు చేరిన ఈవీఎంలు
- ఆర్‌యూ వద్ద మూడంచెల భద్రత
- స్ట్రాంగ్ రూంలు పరిశీలించిన జనరల్ అబ్జర్వర్ జాఫర్, కలెక్టరు, జేసీ

కర్నూలు, మే 14 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సంగ్రామం సోమవారం ముగిసింది. ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. పటిష్టమైన భద్రతతో ఈవీఎంలను రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు చేర్చారు. ప్రభుత్వ వ్యతిరేకత బలంగా ఉండడంతో ఓటరు దేవుళ్లు తమనే కటాక్షించారని, గెలుపు తమదేనంటూ టీడీపీ అంటోంది. కాదు.. కాదు సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు మాకే ఓటేశారు.. విజయం మాదేనంటోంది వైసీపీ. ఇలా గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా పోలైన ఓట్ల ఆధారంగా గెలుపు అంచనాలు వేస్తున్నారు. ఊహించని ఫలితాలు టీడీపీ సొంతం చేసుకుంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధీమా వ్యక్తం చేశారు. ఎవరి అంచనాలు ఎలా ఉన్నా.. ఓటర్ల నిశ్శబ్ద తీర్పు ఏ పార్టీకి అనుకూలమో..? తెలియదు. ఫలానా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందంటూ అంటూ ఏ ఇద్దరు కలిసినా ఇదే హాట్ టాపిక్. ఈ క్రమంలో బెట్టింగ్ జోరు కూడా సాగుతోంది.

జిల్లాలో కర్నూలు లోక్‌సభ స్థానాలతోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 6 గంటలకు ముగిసినా.. పలు గ్రామాల్లో అర్ధరాత్రి 11.30 గంటల వరకు ఓటర్లు క్యూలైన్లలో నిలబడి ఓటు వేయడం కొసమెరుపు. 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల వారిగా పోలైన ఓట్లను లెక్కించి నియోజకవర్గ ఆర్వోల పర్యవేక్షణలో ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఎనిమిది నియోజకవర్గాల్లో 20,54,563 మంది ఓటర్లు ఉండగా 15,70,007 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో సగటున 76.42 శాతం పోలింగ్ నమోదైంది. రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు చేర్చారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఈవీఎంలు భద్రత పరిచిన స్ట్రాంగ్ రూంలకు నిబంధనలు ప్రకారం ఏజెంట్ల సమక్షంలో సీల్ వేశారు. పారా మిలిటరీ బలగాలతో భద్రత నిర్వహిస్తున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు రోజున స్ట్రాంగ్ తాళాలు తెరుస్తారు. ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జాఫర్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు జి.సృజన స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు.



ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అధికారులు



ఓటరన్న తీరు ఎవరి పక్షం!

కర్నూలు పార్లమెంట్ స్థానం సహా కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల నుంచి 121 మంది బరిలో ఉన్నారు. ఏప్రిల్ 29న ఉప సంహరణ గడువు ముగియడంతో పోరులో తలపడిన అభ్యర్థులు ఎవరో తెలిపోయింది. ఆ రోజు నుంచి ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రధాన పార్టీలైన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్ పార్టీ సహా వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 వరకు విస్తృత ప్రచారం చేశారు. ఎలాగైనా గెలవాలనే లక్ష్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రలోభాలకు సై అన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.500 కోట్లకు పైగా డబ్బులు ఓటర్లకు పంపిణీ చేశారని అంచనా. మెజార్టీ నియోజకవర్గాల్లో ఓటుకు రూ.500-1,000 పంపిణీ చేస్తే కొన్ని నియోజకవర్గాల్లో రూ.2 వేలకు పైగా పంపిణీ చేసినట్లు సమాచారం. ఏ అభ్యర్థి ఇంటికి వచ్చినా మా ఓటు మీకే..! అంటూ ఓటర్లు చెబుతూ వచ్చారు. పార్టీలకు అతీతంగా ఎవరు డబ్బులు ఇచ్చినా తీసుకుని జేబులో వేసుకున్నారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని నచ్చిన అభ్యర్థికి ఓటు వేశారు. ఆ ఓటు ఎవరికి వేశారు..? ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపారు..? ప్రస్తుతం రాజకీయ పార్టీల్లో ప్రధాన జరుగుతున్న చర్చ. గామాలు, పోలింగ్ కేంద్రాల వారిగా పోలైన ఓటర్ల లెక్కలను ముందేసుకుని ఫలానా గ్రామంలో మనకు తక్కువగా పోలయ్యాయి.. ఫలానా గ్రామంలో మన అభ్యర్థికి ఇన్ని వందల మెజారిటీ వస్తుంది.. మండలంలో అన్ని గ్రామాలలో లెక్కలు వేస్తే.. మన పార్టీ అభ్యర్థికే మెజారిటీ వస్తుందని.. ఫలానా మండలంలో ప్రత్యర్థికి మెజారిటీ వచ్చినా.. ఆ మెజారిటీ ఇంకో మండలంలో సమానం చేసి గెలుస్తామని టీడీపీ కూటమి. వైసీపీ నాయకులు, అభ్యర్థులు అంచనాలు వేస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

స్వల్పంగా పెరిగిన ఓటింగ్

2019 ఎన్నికల్లో పోలిస్తే ఓటింగ్ స్వల్పంగా పెరిగింది. నాడు పాణ్యంతో పాటు కర్నూలు లోక్‌సభ స్థానంలో పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 75.87 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం పోలింగ్ జరిగిన తాజా ఎన్నికల్లో 76.42 శాతం పోలింగ్ నమోదైంది. అంటే.. 0.55 శాతమే ఓటింగ్ పెరిగినట్లు తెలుస్తోంది. అయితే.. గత ఎన్నికలతో పోలిస్తే 1,72,517 మంది ఓటర్లు అదనంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాడు.. నేడు పోలైన ఓట్లతో పోలిస్తే 12.34 శాతం ఓటర్లు అదనంగా పోలంగ్ కేంద్రాలకు చేరుకున్నట్లు సమాచారం. ఓటింగ్ పెరిగడానికి ప్రధాన కారణం గతంతో పోలిస్తే ఓటర్లు కూడా పెరగడమే. పురుష ఓటర్లు 10,13,794 మంది ఉంటే.. 7,88,079 మంది (77.73 శాతం) ఓటు వేశారు. మహిళా ఓటర్లు 10,40,451 మంది ఉంటే 7,81,793 మంది (75.13 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంటే.. మహిళలతో పోలిస్తే పురుషులే ఎక్కువ శాతం ఓటు వేశారు. వారి తీర్పే కీలకం కానుంది.

కాయ్ రాజా కాయ్..!

పోలింగ్ ముగిసింది.. ఓటర్ల తీర్పు ఈవీఎం యంత్రాల్లో నిక్షిప్తమై స్ట్రాంగ్ రూంలకు చేరింది. గెలుపుపై ఎవరి అంచనాలు వారివి. రాష్ట్రంలో టీడీపీకి ఎన్ని సీట్లు వస్తాయి.. వైసీపీకి ఎన్ని సీట్లు వస్తాయి..? ప్రభుత్వం ఏ పార్టీ ఏర్పాటు చేయబోతుంది..? జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని ఎన్ని సీట్లు వస్తున్నాయి..? ఏ నియోజకవర్గంలో ఏ అభ్యర్థి గెలవబోతున్నారు..? అంటూ భారీగా బెట్టింగ్ సాగుతోంది. ప్రధానంగా కడప జిల్లాకు చెందిన ప్రొద్దుటూరుకు చెందిన పెట్టింగ్ టీం ఒకటి జిల్లాలో మాకాం వేసి బెట్టింగ్ జోరు పెంచినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పాణ్యం, కర్నూలు, బనగానపల్లె, డోన్, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపుపై బెట్టింగ్ సాగితే.. రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనే దానిపై బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం. ఒకటికి పదే (రూపాయికి రూ.10) ఇచ్చేలా బెట్టింగ్ సాగుతుందని సమాచారం. వైసీపీకి 70-75 స్థానాలకు మించి రావని కడప జిల్లాకు చెందిన ఓ టీం పందెం కాస్తున్నట్లు తెలుస్తోంది.



స్ట్రాంగ్ రూమ్‌కు తాళం వేస్తుండగా పరిశీలిస్తున్న జేసీ



స్ట్రాంగ్ రూమ్‌కు తాళం వేస్తుండగా పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టాలి: ఈవో



రోడ్డును పరిశీలిస్తున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మే 14: శ్రీశైలం దేవస్థానంలో పలు రహదారుల విస్తరణకు చర్యలు చేపట్టాలని ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఈవో డి. పెద్దిరాజు క్షేత్రపరిధిలోని రద్దీగా ఉండే రహదారులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రానికి వాహనాల ద్వారా విచ్చేసే భక్తుల సంఖ్య రోజురోజుకు అధికమవుతోందని, ఈ నేపథ్యంలో క్షేత్రంలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని అన్నారు. ఆలయానికి సమీపంలో వాహనాలను పార్కింగ్ చేసుకుని, దర్శనానంతరం క్షేత్రం వెలుపలికి వెళ్లే విధంగా రూట్ డైవర్షన్స్, టెంపుల్ పార్కింగ్ ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు అధికంగా సంచరించే ప్రదేశాలలో ఎటువంటి వాహనాలను అనుమతించకూడదని సిబ్బందికి సూచించారు. ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం చుట్టూ స్వల్ప విస్తీర్ణంలో సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. భక్తులు సంచరించే ప్రదదేశాలలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు దృఢమైన రక్షణ కంచె ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మురళీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు(అర్బన్), మే 14: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 16 నుంచి జూన్ 15 వరకు డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 61 పరీక్షా కేంద్రాల్లో 3374 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షల కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాలు టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

రేపటి నుంచి బీఈడీ సెమిస్టర్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 16 నుంచి బీఈడీ, డీపీఈడీ, ఎంపీఈడీ 1, 3, 4, సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశామని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 15 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

కసితో ఓటు వేశారు

- జిల్లాలోని అన్ని సీట్లలో గెలుస్తాం
- ప్రజలు వైసీపీని నమ్మలేదు..
- జనసేన, బీజేపీ నాయకులు బాగా పని చేశారు
- సూపర్ సిక్స్ అన్ని వర్గాలను ఆకట్టుకుంది
- ఓటమి భయంతో వైసీపీ ప్రలోభాలకు పాల్పడింది
- కలెక్టర్, ఎస్పీలు ఎన్నికల్లో ప్రశాంత వాతావరణం కల్పించారు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), మే 14: ఓటు వేయడానికి సోమవారం పోలింగ్ కేంద్రాలలో బారుల తీరిన జనాన్ని చూస్తే ...వైసీపీపై కసితో టీడీపీకి ఓటు వేసినట్లు తెలుస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓడిపోతామనే భయంతో వైసీపీ నాయకులు ఓటర్లకు డబ్బుపంచి ప్రలోభాలకు పాల్పడ్డారని ఆరోపించారు. జిల్లాలోని అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని అన్నారు. జూన్ 4 తర్వాత చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటవుతుందని, ఇచ్చి హామీలు అమలు చేస్తామని చెప్పారు. జిల్లాలో బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు బాగా పని చేశారని కొనియాడారు. సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాల మహిళలను ఆకట్టుకున్నాయని అన్నారు. జీవనోపాధి కోసం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన వారు ఎన్నికల కోసం వచ్చి ఓటింగ్‌లో పాల్గొనడం అభినందించదగ్గ విషయమన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్న ఉద్దేశంతో ఓటు వేశారన్నారు. ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి పాలనలో కొనసాగించిన అప్రజాస్వామిక పాలనపట్ల విసిగి పోయిన ప్రజలు ఆయనను ఇంటికి పంపాలని డిసైడ్ అయ్యారుకాబట్టే ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పారన్నారు. చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ చేసిన పోరాటాలకు ప్రజలు మద్దతు పలికారని, జగన్ ప్రభుత్వానికి ఈనెల 5 నాటి పోస్టల్ బ్యాలెట్‌తోనే పతనం ప్రారంభమైందని, 13నాటి పోలింగ్ తీర్పు కూడా దానికి అనుకూలంగా ఉందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రశాంత పోలింగ్‌కు సహకరించిన కలెక్టర్, ఎస్పీలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన జగన్‌రెడ్డి శనిని ప్రజలు ఓటు అనే ఆయుధం ద్వారా వదలించుకున్నారన్నారు. చరిత్రలో ఎన్నడు లేని విధంగా ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు ప్రజలు చేరుకోవడం, రాష్ట్ర భవిష్యత్ కోసం వేశామని ఓటర్లు చెప్పడం చూస్తే తెలుగుదేశం విజయం ఖాయమన్నారు. ఈ సమావేశంలో మహిళా అధ్యక్షురాలు ముంతాజ్, నాయకులు జే. తిరుపాలుబాబు, నంద్యాల నాగేంద్ర, సత్రం రామకృష్ణుడు, హనుమంతరావు చౌదరీ, పి. రవికుమార్ పాల్గొన్నారు.

మంత్రి బుగ్గనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

బేతంచెర్ల, మే 14: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పట్టణంలో మంత్రి బుగ్గన ఇంటి సమీపంలో రిటైర్డు అడిషినల్ ఎస్పీ పీఎన్ బాబును కులం పేరుతో తిట్టిన మంత్రి బుగ్గన, ఆయన అనుచరులు చలంరెడ్డి, నాగరాజు, నాగేశ్వరరావుతోపాటు మరో 30 మంది వైసీపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసూమ్ మంగళవారం తెలిపారు. ఎన్నికల పోలింగ్‌లో భాగంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆయన అనుచరులు పల్లెలు తిరుగుతూ ఇంటికి రాగా వారి వెనుకాల వెంబడిస్తూ వస్తున్న రిటైర్డ్ అడిషినల్ ఎస్పీ పీఎన్ బాబు డ్రైవర్‌లను కులం పేరుతో దూషించారని పీఎన్ బాబు ఫిర్యాదు చేశారని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. అయితే మంత్రి బుగ్గన తన ఇంట్లో పని చేసే జయలచ్చమ్మ అనే మహిళతో పీఎన్ బాబు, ఆయన డ్రైవర్‌పైన కూడా కేసు నమోదు చేయించారు. పీఎన్ బాబు డ్రైవర్ కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ తన మీదకు తీసుకొచ్చాడని జయలచ్చమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పీఎన్ బాబుతోపాటు ఆయన డ్రైవర్‌పై కేసు నమోదైనట్లు ఆయన తెలిపారు.

పిడుగు పడి గొర్రెల కాపరి మృతి

ఆత్మకూరు రూరల్, మే 14: నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామ శివార్లలో పిడుగు పడి తెలుగు పెద్ద ఆంజనేయులు(35) అనే గొర్రెల కాపరి మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల మేరకు.. ఆత్మకూరు మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన పెద్ద ఆంజనేయులు వెంకటాపురం గ్రామ శివార్లలోని పొలాల్లో గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. ఆ ప్రాంతంలో పిడుగు పడడంతో పెద్ద ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం పనులు చేసుకుంటున్న గ్రామస్థులు గమనించి సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.. మృతునికి భార్యతో పాటు ఓ కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.



మృతి చెందిన ఆంజనేయులు

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.5

పాఠకుని పూర్తి పేరు : ....
డోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

కర్నూలు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఆదోని				
2. ఆలూరు				
3. పత్తికొండ				
4. కోడుమూరు (ఎస్సీ)				
5. ఎమ్మిగనూరు				
6. కర్నూలు				
7. మంత్రాలయం				
8. ఆళ్ళగడ్డ				
9. బనగానపల్లె				
10. డోన్				
11. శ్రీశైలం				
12. నందికొట్కూరు (ఎస్సీ)				
13. నంద్యాల				
14. పాణ్యం				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయము : ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం : 1/1 & 1/2, ఇండస్ స్కూల్ దగ్గర, గుత్తి రోడ్డు, పందిపాడు గ్రామ పంచాయితి, కల్లూరు (మం.), కర్నూలు -518002.

వైభవంగా గంగాదేవి వార్షిక పుష్కరోత్సవం



కోనేరులో గంగాదేవి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, మే 14: మహానంది క్షేత్రంలో గంగాదేవి వార్షిక పుష్కరోత్సవ పూజలను మంగళవారం ఆలయ వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గంగాదేవి ఉత్సవమూర్తి విగ్రహాన్ని మేళతాళలతో రాజగోపురం వద్దకు తీసుకొచ్చి ఉపచారములన్నీ సమర్పించారు. అనంతరం రుద్రగుండం కోనేరులోని పంచపాండవుల మంటపం వద్దకు గంగాదేవి ఉత్సవమూర్తి విగ్రహాన్ని తీసుకొచ్చి ఆశీనులు చేశారు. అభిషేకపూజలతోపాటు అలంకార హారతులు ఇచ్చి సంకల్ప స్నానం నిర్వహించారు. అనంతరం వంద లాది మంది భక్తులు రుద్రగుండం కోనేరులో గంగాదేవి వార్షిక పుష్కరోత్సవం పురస్కరించుకొని పుణ్యస్నానాలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, సుధారాణి దంపతులతోపాటు దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైశాఖ బ్రహ్మోత్సవాలు



హంస వాహనంపై విహరిస్తున్న జ్వాలా నరసింహ స్వామి

ఆళ్లగడ్డ, మే 14: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో వైశాఖ నృసింహస్వామి జయంతి బ్రహ్మత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా వేకువ జామున్నే ఉత్సవమూర్తి జ్వాలా నరసింహ స్వామిని విశేషంగా అలంకరించి పూజల అనంతరం అభిషేకించారు. స్వామి వారిని హంస వాహనంపై మాడ వీధుల్లో విహరింపజేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సుధాకర్ రెడ్డిపై హత్యాయత్నం చేసిన వారిని అరెస్టు చేయాలి

టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



ఫిర్యాదు చేస్తున్న మల్లెల రాజశేఖర్, చదువుల సుధాకర్ రెడ్డి

ఓర్వకల్లు, మే 14 మండలంలోని పాలకొలను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చదువుల సుధాకర్ రెడ్డిని హత్యచేసేందుకు వచ్చిన వైసీపీ గూండాలను తక్షణమే అరెస్టు చేసి కేసు నమోదు చేయాలని టీడీపీ నాయకుడు మల్లెల రాజశేఖర్ డిమాండ్ చేశారు. మల్లెల రాజశేఖర్‌తో పాటు చదువుల సుధాకర్ రెడ్డి భారీ జనంతో ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ తేదీ జరిగిన పోలింగ్‌లో చదువుల సుధాకర్ రెడ్డి పోలింగ్ బూత్ ఏజెంటుగా ఉండటం, ప్రజలు టీడీపీకి ఓట్లు వేయడం జీర్ణించుకోలేని గ్రామ వైసీపీ నాయకులు రాత్రి వెంకటసుబ్బారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కాముగల మహేష్, సోమన్న, ఆవుల పెద్ద మద్దయ్య, నాగార్జున, రవీంద్ర, రహింతుల్లా, వెంకట్రామిరెడ్డి, రామక్రిష్ణ, మనోహర్‌లతో పాటు మరి కొంత మంది సుధాకర్ రెడ్డి ఇంటికి వెళ్లి కాంపౌండులోకి దూకి హత్య చేసేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. వైసీపీ వాళ్లు కొడవళ్లు, ఇనుపరాడ్లు, బండరాళ్లతో వెళ్లగా, అక్కడే ఉన్న వేణుగోపాల్ రెడ్డితో పాటు మరి కొంత మంది వాళ్లను ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ విషయం తెలిసి ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి పోలీసు బలగాలతో సుధాకర్ రెడ్డి ఇంటి వద్దకు చేరుకుని గూండాలను తరిమికొట్టారు. అధికార పార్టీ నాయకుల అండదండలతోనే వైసీపీకి చెందిన వారు ఈ హత్యాయత్నం చేశారని, ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలోని దృశ్యాల ఆధారంగా హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, తనకు రక్షణ కల్పించాలని సుధాకరరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

హెచ్.కొట్టాలలో టీడీపీ నాయకులపై వైసీపీ నాయకుల దాడులు

మండలంలోని హెచ్.కొట్టాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కోదండరామిరెడ్డి, అతని కుమారుడు విజయనాగిరెడ్డిపై సోమవారం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. తాము ఓటు వేసేందుకు వెళ్లగా.. వైసీపీకి చెందిన వడ్డె ఉమాశంకర్, వడ్డె మహేంద్ర, భూపతి, వడ్డె కిట్టు, వడ్డె వెంకటేశ్వర్లు, వడ్డె మధు, శ్రీనివాసరెడ్డి, మల్లికార్జున కలిసి రాళ్లతో, కర్రలతో దాడులు తమపై దాడి చేశారని ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. దాడులకు పాల్పడిన వైసీపీ కార్యకర్తలపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.


డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు వన్‌టైం నోటిఫికేషన్

1994నుంచి 2014వరకు పాస్‌కాని విద్యార్థులకు అవకాశం

అనంతపురం సెంట్రల్, మే 14: ఎస్కేయూ ఆధ్వర్యంలో డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఒక్కసారి అవకాశం పేరుతో నోటిఫికేషన్ విడుదల చేశామని పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు 1994-95 నుంచి 2014-15వరకు డిగ్రీలో ఫెయిలయిన విద్యార్థులందరూ అర్హులని పేర్కొన్నారు. జూన్ 14వరకు పరీక్షా ఫీజు చెల్లింపు గడువు విధించామన్నారు. ఫీజు చలానా, నామినల్ రోల్స్‌తోపాటు దరఖాస్తు కాపీలను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు జూన్ 18లోపు ఎస్కేయూ పరీక్షల విభాగంలో సమర్పించాలని సూచించారు. రూ.1000 ఫైన్‌తో జూన్ 21వరకు, రూ.3వేల ఫైన్‌తో 28లోపు చెల్లించ వచ్చన్నారు. పరీక్షల నిర్వహణ తేదీ ముందురోజు వరకు ఫీజుతోపాటు రూ.5వేల ఫైన్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక సబ్జెక్టుకు రూ.2వేలు, రెండు సబ్జెక్టులకు రూ.3వేలు. మూడు నుంచి ఆపై ఎన్ని సబ్జెక్టులున్నా రూ.4వేల ఫీజును నిర్ధారించామని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి తృతీయ సంవత్సరం కళాశాలను వీడిన విద్యార్థులు రూ.3వేల ఫైన్‌తో పరీక్షల ఫీజు కట్టవచ్చు అన్నారు. కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ఎస్కేయూ ఆధ్వర్యంలో డిగ్రీ చేసిన విద్యార్థులున్నారని, వారందకీ వన్ టైం చాన్స్ పేరుతో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పరీక్షలు, ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఎప్పుడు నిర్వహించేది టైంటేబుల్‌ను త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని అనంతపురం కేఎస్ఎన్ మహిళా ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేస్తామన్నారు. వివరాలకు ీటీటీ.ఱఙుఱజీళ్టుటఙ్ఠ్ఛి.జీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఓటర్లు ఎటు మొగ్గారు?

- ప్రధాన పార్టీల నుంచి డబ్బులు తీసుకున్న ఓటర్లు
- ఇస్తే కాదనలేదు.. ఇచ్చినోళ్లకే ఓటేసిందీ లేదు...!
- చాకచక్యంగా వ్యవహరించిన ఓటర్లు



ఆదోని, మే 14: పోలింగ్ ఎలా జరిగింది..? ఓటర్లు ఎటువైపు మొగ్గారు..? మనకు ఓటేశారా... లేదా..?.. ఏ ఊరిలో ఏ పార్టీకి ఎక్కువ ఓట్లు పడ్డాయి..? కేటగిరీల వారిగా ఏమైనా ఓట్లు పడ్డాయా..? కులసంఘాల ఓట్లు గంపగుత్తగా పడ్డాయా..? ఏ బూత్‌లో ప్లస్ ఉంది..? ఏ బూత్‌లో మైనస్ ఉంది..? మెజారిటీ ఎంత వస్తుంది..? డబ్బుల ప్రభావం ఏమేరకు ఉటుంది..? గాలి ఎటువైపు వీచింది..? అనే అంశాలపై ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, ముఖ్యనేతలు మంగళవారం రోజంతా ఆరా తీశారు. పోలింగ్‌కు, ఓట్ల లెక్కింపునకు మధ్య 20 రోజులు గ్యాప్ ఉండటంతో.. ప్రధాన పార్టీల నేతల పోలింగ్ ట్రెండ్ పై దృష్టి సారించారు. పోల్ మేనేజ్‌మెంట్ ఎలా చేశాం..? చివరి రెండు రోజుల పనితీరు ఎలా ఉంది..? డబ్బుల పంపిణీ పకడ్బందీగా జరిగిందా..? లేదా..? ప్రణాళికలో ఏమైనా లోపాలు ఉన్నాయా..? గ్రామస్థాయిలో ఉన్న లీడర్లు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయకుండా వారే ఉంచుకున్నది ఎవరు? అనేది ఫలితాలు వచ్చాక తెలుస్తుందని ఎవరికి వారు సమీక్షలు నిర్వహించారు. ఏయే పోలింగ్ బూత్‌ల్లో ఏ మేరకు పోలింగ్ జరిగింది..? ఎవరు ఎటువైపు మొగ్గు చూపారు..? పరిస్థితి ఏమిటి..? అంటూ జర్నలిస్టులు, రాజకీయ విశ్లేషకులకు ఫోన్లు చేసి ఆరా తీశారు. అదే క్రమంలో ఎగ్జిట్ పోల్స్‌నూ నిశితంగా పరిశీలించారు. మొత్తానికి గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రెండోసారి అధికారంలోకి వస్తామనే అభిప్రాయంతో వైసీపీ ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, తమకు అనుకూల వాతావరణం ఉన్నదని ఎన్డీఏ కూటమి ధీమాతో ఉంది. ఈసారి తమకు సీట్లు పెరుగుతాయని కాంగ్రెస్ కూడా అంటోంది.

డబ్బులు తీసుకున్నా.. నచ్చిన అభ్యర్థికే ఓటు...

ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు పోటీ పడి మరీ డబ్బులు పంచిపెట్టారు. ఇరు పార్టీలు అభ్యర్థులు రూ.500 నుంచి 1000 దాకా పంపిణీ చేశారు. గంపగుత్తుగా ఓట్లు పడతాయన్న ఆశతో పెద్ద మొత్తంలోనే అందజేశారు. ఎవరు ఎన్ని డబ్బులిచ్చినా.. ఓటర్లు తీసుకున్నారు. ఓటు మాత్రం తమకు నచ్చిన అభ్యర్థికే వేశారు. ఎక్కువ డబ్బులిచ్చిన పార్టీకే ఓటు వేస్తారని భావించగా.. తీరా పోలింగ్ సరళి చూస్తే అలాంటి వాతావరణమే కనిపించలేదు.

అది మన డబ్బే కదా....!



రాజకీయ పార్టీల నేతలు డబ్బులు పంచిన అంశాన్ని ప్రజలు పెద్దగా సీరియస్‌గా తీసుకోవటం లేదు. అధికారంలో ఉండి.. అక్రమంగా డబ్బులు సంపాధించారని, అది కూడా ప్రజల డబ్బే కదా..? ఏమైనా ఇంట్లో నుంచి తెచ్చి పెడుతున్నారా..? అనే అభిప్రాయాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో డబ్బు తీసుకోవటాన్ని తప్పుగా భావించటంలేదు. ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం అధికార వైసీపీ అసాధారణ స్థాయిలో ఖర్చు పెట్టింది. ఎన్డీఏ కూటమి అభ్యర్థి కూడా వైసీపీ అంత కాకపోయినా, ఎంతో కొంత పంపిణీ చేసినట్లు తెలుస్తుంది. డబ్బులు ఎంత ఖర్చు పెట్టినా.. ప్రజలు తమకు నచ్చిన వారికే ఓటు వేస్తాయని పరిశీలనలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు అదే విధంగా వస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మంత్రి బుగ్గనను అరెస్టు చేయాలి

కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్‌లో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మే 14: ఎన్నికల పోలింగ్‌లో స్వతంత్ర అభ్యర్థి పీఎస్ బాబుపై దాడి చేసిన కేసులో మంత్రి బుగ్గనను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఓటమి భయంతోనే మంత్రి బుగ్గన డోన్ నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్‌లో అరాచకాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. డోన్ డీఎస్పీ, సీఐలు, పోలీసులు మంత్రికి తొత్తులుగా మారి టీడీపీకి వ్యతిరేకంగా పని చేయడం దారుణమన్నారు. దళితుడైన రిటైర్డు అడిషనల్ ఎస్పీ పీఎస్ బాబు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారని, బేతంచెర్లలో పోలింగ్ కేంద్రం వద్దకు వెళితే.. మంత్రితోపాటు ఆయన అనుచరులు దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఐదేళ్లపాటు మంత్రి బుగ్గన, ఆయన అనుచరులు అరాచకాలు చేస్తూ ప్రజలను దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక మంత్రి బుగ్గనను ఓడించారని, డోన్‌లో తన విజయానికి ప్రజల ఆశీస్సులు అందించారన్నారు. తాము అధికారంలోకి రాగానే డోన్‌లో గంజాయి, మట్కాను పూర్తిగా లేకుండా చేస్తామని కోట్ల ప్రకటించారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, రైతులకు తాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్యగౌడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు, తూర్పు లింగారెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్, చంద్రకళాచారి, నాయకులు బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, జనసేన నాయకులు బ్రహ్మం పాల్గొన్నారు.

ఆర్ ఖానాపురంలో ఘర్షణ .. ఒకరికి గాయాలు

గూడూరు, మే 14: గూడూరు మండలంలోని ఆర్ ఖానాపురం గ్రామంలో ఘర్షణ చోటుచేసుకోగా ఒకరికి గాయాలు అయ్యాయి. మంగళవారం ఆర్ ఖానాపురం గ్రామానికి చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి బుల్లెట్‌పై గట్టిగా శబ్దం చేస్తూ వీధిలో తిరుగుతుండగా, దస్తగిరి అనే వ్యక్తి అభ్యంతరం చెప్పాడు. దీంతో రాఘవేంద్ర ఆగ్రహించి దస్తగిరిపై దాడి చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు దస్తగిరిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘర్షణ విషయం తెలుసుకున్న గూడూరు ఎస్ఐ హనుమంతయ్య హుటాహుటిన ఆర్ ఖానాపురం గ్రామానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ దస్తగిరిపై దాడికి ప్పాడిన సంఘటనపై విచారణ జరిపి దాడికి పాల్పడిన రాఘవేంద్రపై చర్యలు తీసుకుంటామన్నారు.

కర్నూలు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా నమోదైన ఓటింగ్ శాతం వివరాలు

కర్నూలు(కలెక్టరేట్), మే 14: కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం వారిగా :

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య				పోలైన ఓటర్ల సంఖ్య				
	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
137- కర్నూలు	132769	141665	31	274465	86250	86715	08	174973	63.75
142-పత్తికొండ	111603	111978	22	223603	96330	93668	11	190009	84.98
143-కోడుమూరు-ఎస్సీ	123468	123148	16	246632	98880	96293	07	195180	79.14
144-ఎమ్మిగనూరు	122041	125664	47	247752	101914	101153	19	203086	81.97
145-మంత్రాలయం	102155	106172	23	208350	87808	87848	11	175667	84.31
146-ఆదోని	130364	132642	52	263058	87949	87096	19	175064	66.55
147-ఆలూరు	130083	128861	53	258997	106995	102075	22	209092	80.73
మొత్తం	852483	870130	244	1722857	666126	656848	97	1323071	76.80

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం వారిగా

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య				పోలైన ఓటర్ల సంఖ్య				
	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
137- కర్నూలు	132769	141665	31	274465	86250	88715	08	174973	63.75
138-పాణ్యం	161311	170321	74	331706	121952	124945	38	246935	74.44
142-పత్తికొండ	111603	111978	22	223603	96330	93668	11	190009	84.98
143-కోడుమూరు-ఎస్సీ	123468	123148	16	246632	98881	96293	07	195181	79.14
144-ఎమ్మిగనూరు	122041	125664	47	247752	101914	101153	19	203086	81.97
145-మంత్రాలయం	102155	106172	23	208350	87808	87848	11	175667	84.31
146-ఆదోని	130364	132642	52	263058	87949	87096	19	175064	66.55
147-ఆలూరు	130083	128861	53	258997	106995	102075	22	209092	80.73
మొత్తం	1013794	1040451	318	2054563	788079	781793	135	1570007	76.42

కుటుంబ సభ్యులతో సరదాగా..



కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడుపుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

ఆత్మకూరు, మే 14: మొన్నటి వరకు ఎన్నికల హడావిడితో విశ్రాంతి లేకుండా గడిపిన శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి మంగళవారం కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. నంద్యాల జిల్లా వెలుగోడు మండలంలోని వేల్పనూరులో గల ఆయన స్వగృహంలో తన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఎన్నికల ప్రచారం గురించి ఒకరినొకరు గుర్తు చేసుకున్నారు. అలాగే తన అనుచరులకు కూడా చక్కటి విందు ఇచ్చారు. మంగళవారం అంతా ఎక్కడికి వెళ్లకుండా ఇంట్లోనే కుటుంబ సభ్యులతో గడిపారు.

ఉరుకుందలో టీజీ భరత్ పూజలు



టీజీ భరత్‌ను సన్మానిస్తున్న స్థానిక టీడీపీ నాయకులు

కౌతాళం: కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ మంగళవారం జిల్లాలోని ఉరుకుందలో పూజలు చేశారు. ఈరన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ఇంటి దైవం ఈరన్న స్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని, రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అలాగే కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి టీడీపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాటి నాగరాజు మంగళవారం కర్నూలు నగరంలోని సంతోష్‌నగర్ సమీపంలో ఉన్న ఫాం హౌస్‌లో కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. వారితో కలిసి గ్రూప్ ఫొటో దిగి ఆనందం వ్యక్తం చేశారు.



కుటుంబ సభ్యులతో కలిసి ఫొటో దిగుతున్న ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

విద్యుత్ మోటార్ల దగ్గరకు వెళ్లాలి: ఏడీ



నేలకొరిన విద్యుత్ స్తంభాలు

సి. బెళగల్, మే 14: సి. బెళగల్ మండలంలోని రైతులు, వ్యవసాయ కూలీలు విద్యుత్ మోటార్ల దగ్గరకు వెళ్లే సమయంలో పాదరక్షలు వేసుకొని వెళ్లాలని విద్యుత్ ఏడీ జాన్సన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కొత్తకోట, బురాన్‌దొడ్డి, గుండ్రేవుల, పోలకల్లు, గూడూరు, కోడుమూరు, పులకుర్తి, లద్దగిరి తదితర గ్రామాలలో ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు, స్తంభాలు నెలకొరిగాయన్నారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ మోటార్ల దగ్గరకు వెళ్లే రైతులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఆయన వెంట ఏఈ సుకుమార్ ఉన్నారు.

సీ బెళగల్‌లో భారీ వర్షాలు



వర్షానికి నిండిన చెక్‌డ్యామ్‌లు

సి. బెళగల్, మే 14: మండలంలో 18 గ్రామ పంచాయతీలలో అది, సోమవారాలలో భారీ వర్షాలు కురిశాయి. మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో చెక్ డ్యామ్‌లు నిండి పొర్లి పారాయి. దీంతో మండలంలోని రైతులు, రైతు కూలీలు సంతోషం వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ గతంలో మే నెలలో ఎప్పుడూ ఇంత వర్షం కురువలేదని అన్నారు.

బళ్లారి రోడ్ సెక్షన్‌లో విద్యుత్ కోత

కల్లూరు, మే 14: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలోని బళ్లారి రోడ్ సెక్షన్‌లో విద్యుత్ కోత ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనులు జరిగే ప్రాంతాల్లో విద్యుత్ పరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ మేరకు ఇందిరాగాంధీనగర్, పాత ఈద్గా, మహావీర్‌నగర్, సంతోష్‌నగర్, రాజీవ్‌నగర్, నిర్మల్‌నగర్, డి.మార్ట్ ఏరియా, క్రిష్ణారెడ్డినగర్, గోపినగర్, మల్లారెడ్డి రిచ్‌మండ్, శ్రీనివాసనగర్, ఎస్‌ఏపీ క్యాంప్, పాతకల్లూరు రోడ్, తదితర ప్రాంతాల్లో కరెంట్ కోత ఉంటుందన్నారు.

ఏపీఈఆర్సీ బిల్డింగ్ పనుల పరిశీలన

కల్లూరు, మే 14: నగరంలోని కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలో ఏపీఈఆర్సీ భవన నిర్మాణ పనులను ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సివి. నాగార్జునరెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆయన ఏపీఈఆర్సీ టెక్నికల్ మెంబర్ ఠాకూర్‌సింగ్, కర్నూలు ఎస్ఈ ఎం. ఉమాపతితో కలిసి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. గడువులోపు నిర్మాణ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, భాస్కర్‌రెడ్డి, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వీహెచ్‌పీ శిక్షణ శిబిరం

కర్నూలు(కల్చరల్), మే 14: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచీ 25 వరకు వీహెచ్‌పీ కార్యకర్తల శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ, ఆలయాల సంరక్షణ, సమాజంలో హిందువులపై జరిగే దాడులను అడ్డుకోవడం అనే అంశంపై ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య దాతృత్వంతో, నగర శివారు లక్ష్మీపురం వద్ద గల రిడ్జ్ పాఠశాల్లో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి టీజీవీ కళాక్షేత్రంలో వేసవి 'వినోద సంబరాలు'

కర్నూలు(కల్చరల్), మే 14: నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో బుధవారం, గురువారం 'వేసవి వినోద సంబరాలు' పేరుతో శాస్త్రీయ నృత్యాలు, జబర్దస్త్ కళాకారులతో హాస్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు శాస్త్రీయ కూచిపూడి నృత్యాలు, జానపద నృత్యాలు ఉంటాయని, నాట్యోత్సవం పేరుతో స్థానిక కూచిపూడి, జానపద నృత్య కళాకారులు ఈ ప్రదర్శనలు ఇస్తారని తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటలకు జబర్దస్త్ కళాకారులతో హాస్య ప్రదర్శనలు ఉంటాయని, ఇందులో అదిరే అభి, వినోదిని, చిత్రం శ్రీను, షేకింగ్ షేకు, అదుర్స్ ఫణి తదితరులు తమ ప్రదర్శనలు ఇస్తారని ఓబులయ్య తెలిపారు.

శాంతి హోమాలు

మద్దికెర, మే 14: మద్దికెర గ్రామంలోని మద్దమ్మకుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో శాంతి హోమాలు నిర్వహించా రు. మంగళవారం ఆలయ నిర్వాహకులు విజయప్రసాద్ ఆధ్వర్యంలో పురోహితులు నక్షత్ర దోషం, కుజ దోషం, రాహుకేతు నివారణ, ప్రత్యేక వి ద్యా వ్యాపార అభివృద్ధి శాంతి కోసం హోమాలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్ సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశా రు.

జూన్ 4న టీడీపీ అధికారంలోకి..

- పాణ్యం నియోజకవర్గంలో టీడీపీదే గెలుపు
- స్వచ్ఛందంగా ఓటెత్తిన ప్రజలు, భారీగా పోలింగ్
- పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత



మాట్లాడుతున్న గౌరు చరిత

కల్లూరు, మే 14: తెలుగుదేశం కూటమి జూన్ 4న రాష్ట్రంలో అధికారంలోకి రాబోతోందని, పోలింగ్‌లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఓటుహక్కు వినియోగించుకోవడమే అందుకు నిదర్శనమని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మాధవీనగర్‌లోని తన స్వగృహంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆయన కొడుకు కాటసాని శివ నరసింహారెడ్డి పోలింగ్ కేంద్రాల్లో తిరుగుతూ ఓటర్లను, టీడీపీ పోలింగ్ ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేయడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్యే అగడాలను సహిచలేని ప్రజలు బారులుతీరి ఓటింగ్‌లో పాల్గొన్నారని, అది చూసిన వైసీపీలో ఆందోళన మొదలై పోలింగ్ కేంద్రాల్లో అలజడి సృష్టించడానికి ప్రయత్నించారని అన్నారు. పలు గ్రామాల్లో టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డారని, ఆర్వోకు ఫిర్యాదు చేశామని అన్నారు. వారిపై కేసు నమోదు చేయాలని గౌరు చరిత డిమాండ్ చేశారు. ప్రజలు మార్పు కోరుకున్నారని, పోలింగ్ రోజున అది స్పష్టమైందని పాణ్యం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలవబోతోందని గౌరు చరిత ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ గెలవబోతుందని చంద్రబాబు సీఎం కాగానే అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తామని అన్నారు.

పెరిగిన ఓటింగ్ శాతం

కర్నూలు(న్యూసిటీ), మే 14: సాధారణ ఎన్నికల్లో భాగంగా కర్నూలు అసెంబ్లీ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం రిటర్నింగ్ అధికారి ఏ.భార్గవతేజ పోలింగ్ వివరాలను వెల్లడించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు రాత్రి 9 గంటలకు వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 63.75 శాతం పోలింగ్ జరిగినట్లు ఆర్‌ఓ నిర్ధారించారు. ఉదయం 10 గంటలకు 10.09 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 36.09 శాతం, 3 గంటలకు 47.79 శాతం, 5 గంటలకు 58.15 శాతం, రాత్రి 12 గంటలకు 63.75శాతం నమోదైంది.

కోడుమూరు అసెంబ్లీలో 79.14 పోలింగ్

కర్నూలు(రూరల్)మే14: కోడుమూరు నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గంలో నాలుగు మండలాలు, కర్నూలులో మూడు వార్డులు కలిపి మొత్తం ఓటర్లు 2,46,638 ఉండగా వాటిలో 1,95181 ఓట్లు పోలైనట్లు కోడుమూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేషిరెడ్డి మంగళవారం తెలిపారు. నియోజకవర్గంలో మొ త్తం 79.14 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆయన వివరించారు. కర్నూలు రూరల్ మండలంలో పంచలింగాల గ్రామంలో 40వ పోలింగ్ కేంద్రం, ఈ.తాండ్రపాడులో 46వ పోలింగ్ బూత్‌లో రాత్రి దాక పోలింగ్ ప్రక్రియ జరిగింది. ఈ రెండు గ్రా మాల్లో అకస్మాత్తుగా సాయంత్రం పెద్ద ఎత్తున ఓటర్లు బారుల తీరారు. పైగా కొంత మంది వృద్ధులు ఓటు వేసేటపుడు చాలా సమయం తీసుకోవడమే ఇం దుకు ప్రధాన కారణమని రూరల్ తహసీల్దార్ రామాంజులు నాయక్ తెలిపారు. తొలిశాపురం గ్రామంలో 24వ పోలింగ్ కేంద్రంలో రాత్రి పదిగంటల వర కు పోలింగ్ జరిగింది.

పాణ్యం అసెంబ్లీలో 75.7 శాతం పోలింగ్

కల్లూరు, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పోలింగ్ పాణ్యం నియోజకవర్గంలో ప్రశాతంగా జరిగింది. ఈమేరకు మంగళవారం పాణ్యం ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారపు రెడ్డి మౌర్య పోలింగ్ వివరాలను వెల్లడించారు. పాణ్యం నియోజకవర్గంలో 75.7 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్వో తెలిపారు.



ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

రానున్నది టీడీపీ ప్రభుత్వమే...

ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్



మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

ఆలూరు, మే 14: రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని, జరిగిన ఎన్నికల్లో ప్రజలు టీడీపీకే మొగ్గు చూపారని, ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. మంగళవారం ఆలూరు టీడీపీ కార్యాలయంలో టీడీపీ ముఖ్యనేతల సమావేశం, సీనియర్ నాయకులు తిమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. వీరభద్రగౌడ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయు డు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో అన్ని వర్గాలకు లబ్ధిచేకూరేలా ఉందన్నారు. అందువల్లే ప్రజలు టీడీపీను ఆదరిస్తారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు అవుతాయన్నారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో వేదవతి, నగరడోణ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవడం వల్ల నిర్మాణం పనులు నిలిచిపోయయాన్నారు. దీంతో సాగునీరు, లేక పంటలు పండకపోవడంతో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు పలసలు వెళ్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెం టనే రెండు ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల కోసం నెల రోజుల పాటు శ్రమించిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు రామ్‌నాథ్ యాదవ్, కురువ జయరాం, మండల కన్వీనర్ పరమారెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకులు మనేకుర్తి రాజశేఖర్, నారాయణ, డా. నెట్టెప్ప, తాలూకా నాయకులు బిల్లేకల్ వెంకటేష్, కృష్ణ యాదవ్, సాలీ సాహెబ్, నరసప్ప, సురేంద్ర, కొమ్ము రామంజి, నాగరాజు, నౌసేపాటి చౌదరి, ప్రకాష్, జిలానీ, మద్దిలేటి, ఎంపీటీసీ నరసన్న, రాముడు, మహేష్, గుండయ్య, మసాలా జగన్, గోవింద్ పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో మాంటిస్సోరి ఇండస్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



మాంటిస్సోరి ఇండస్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 14: స్థానిక మాంటిస్సోరి ఇండస్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు సీబీఎస్ఈ పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విజయదుందుబి మోగించారు. బి.తేజసాయి 489 మార్కులతో ప్రథమ స్థానం, ఎం.భరత్ కృష్ణ 488 మార్కులతో ద్వితీయ స్థానంలో, ఏ.భవిత 487 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. అకుంఠిత దీక్ష, చక్కటి ప్రణాళికతో కూడిన విద్యాబోధనతో విజయ ఢంకా మోగించిన మాంటిస్సోరి ఇండస్ పాఠశాల యజమాన్యం, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి, మీనాక్షి విల్సన్, సమన్వయకర్తలు సతీష్, స్వర్ణ ఏస్తేర్, రమణ, ప్రవీణ్ ఖుమార్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

● సీబీఎస్ఈ ఫలితాల్లో మాంటిస్సోరి ఎ.క్యాంపు పాఠశాల విద్యార్థుల విజయకేతనం



ప్రతిభ కనబరిచిన ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు



సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు 277 మంది అత్యధిక మార్కులతో విజయ కేతనం ఎగురవేశారు. వి.సాహితి 484 మార్కులతో ప్రథమ స్థానం కె.కావ్యశ్రీ, ఆర్. అద్వైత్ ద్వితీయ స్థానంలోనూ, వి.పస్యింత్, డి.ఆఫ్రీద్, టి.తన్వి, ఎం.సిన హర్షిణి 483 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. 95 శాతం పైగా 12 మంది విద్యార్థులు, 90 శాతం పైగా 59 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. సబ్జెక్టు వారిగా ఇంగ్లీషులో 53, తెలుగులో 111, గణితంలో 48, సైన్స్ 37, సోషల్‌లో 91 మందికి పైగా మార్కులు సాధించి మాంటిస్సోరి విద్యాసంస్థల కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేశారు. పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృంధానికి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మాంటిస్సోరి విద్యాసంస్థల యజమాన్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాజ్యోతి, ప్రిన్సిపల్ జ్యోతి, సమన్వయకర్తలు సుబ్బారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, కల్పన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గిరిజనుల అభివృద్ధికి సహకారం



గిరిజన కుటుంబాలతో సంస్థ ఏవీపీ పునీత్ ఆనంద్

కర్నూలు(అర్బన్), మే 14: గిరిజన సంఘాల అభ్యున్నతికి హుందాయ్ సంస్థ సహకారం ఉంటుందని సంస్థ ఏవీపీ వర్టికల్ హెడ్ పునీత్ ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజికి బాధ్యత, ప్రపంచ లక్ష్యం మానవత్వం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో చెంచు తెగకు చెందిన 150 కుటుంబాలు నివసించే ఐదు గ్రామాలను హెచ్ఎంఐఎఫ్ గుర్తించి వారికి వ్యవసాయ నైపుణ్యాలు అందించడం జరిగిందన్నారు. 250 ఎకరాల భూమి విస్తరించి ఉన్న ప్రాంతంలో జీనోపాధి కల్పన కార్యకలాపాల ద్వారా వారికి సాధికార కల్పించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

కోసిగిలో విద్యుత్ కోతలు



కోసిగిలో విద్యుత్ కోతలతో ఆయిల్ షాపు ముందు కూర్చున్న ప్రజలు

కోసిగి మే 14: కోసిగిలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ కోతలతో కోసిగి ప్రజలు అల్లాడిపోయారు. ఓ వైపు ఉక్కపోత, మరో వైపు కరెంటు కోతలతో ప్రజలు, గర్భిణులు, పిల్లలు అల్లాడిపోయారు. మంగళవారం కోసిగి సంత ఉండటంతో ఆయా గ్రామాల నుంచి వచ్చిన పల్లె ప్రజలు కరెంటు లేకపోవడంతో పిండి, కారం గిర్నిలు, ఆయిల్‌మిషన్ల షాపుల ముందు కరెంటు రాక కోసం గంటల తరబడి వేచి చూశారు. మంగళవారం ఒకే రోజులో చాలాసార్లు కరెంటు తీయడంతో విద్యుత్ అధికారులపై ప్రజలు, వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈవీఎంలకు మూడంచెల భద్రత

కర్నూలు(కలెక్టరేట్), మే 14: ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్ ఈవీఎంలకు రాయలసీమ యూనివర్సిటీలో మూడంచెల భద్రతను కల్పించి, నిత్యం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన అన్నారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాక్, లైఫ్ సైన్స్ బ్లాక్, లైబ్రరీ బ్లాక్‌లలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను జనరల్ అబ్జర్వర్లు జాఫర్ మీర్ తారీఖ్ ఆలీ, పంకజ్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి సీల్ వేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13న పోలింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం 8 నియోజకవర్గాల ఈవీఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని రిసెప్షన్ సెంటర్‌కు తీసుకుని వచ్చినట్లు తెలిపారు. ఈవీఎంలు అన్నింటినీ జాగ్రత్తగా స్ట్రాంగ్ రూమ్‌లలో కేంద్ర బలగాల బందోబస్తు నడుమ ఉంచినట్లు తెలిపారు. కర్నూలు, ఆదోని అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను లైఫ్ సైన్స్ బ్లాక్‌లో భద్రపరిచామని అన్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు, పాణ్యం అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను ఇంజనీరింగ్ బ్లాక్‌లో భద్రపరచామని అన్నారు. మంత్రాలయం, పత్తికొండ అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను లైబ్రరీ బ్లాకులో భద్రపరచామన్నారు. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం అసెంబ్లీ పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను జనరల్ అబ్జర్వర్ జాఫర్, కలెక్టర్ డా.జి. సృజన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఆలూరు, పత్తికొండ, ఆదోని అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను జనరల్ అబ్జర్వర్ జాఫర్ మీర్ తారీఖ్ ఆలి, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. పాణ్యం అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను జనరల్ అబ్జర్వర్ పంకజ్ కుమార్, జాయింట్ కలెక్టర్, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్లు జాఫర్, మీర్ తారీఖ్ ఆలి, కర్నూలు ఆర్వో, నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని ఆర్వో, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, కోడుమూరు ఆర్వో, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్వో, ఆర్డీవో రామలక్ష్మి, ఎమ్మిగనూరు ఆర్వో చిరంజీవి, మంత్రాలయం ఆర్వో మురళి, ఆలూరు ఆర్వో రాము నాయక్, ఆయా రాజకీయపార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను భద్రపర్చిన రూములకు తాళాలు వేస్తున్న సిబ్బంది



స్ట్రాంగ్‌రూముల రికార్డులను పరిశీలిస్తున్న జేసీ

టీడీపీదే అధికారం



గెలుపు ధీమాను వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి మే 14: టీడీపీదే అధికారమని ఆ పార్టీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ జడ్పీటీసీ తోవి రామక్రిష్ణ, వక్రాణి వెంకటేశ్, నాడిగేని అయ్యన్న, పంపాపతి అన్నారు. విక్టరి సింబల్ చూపిస్తూ విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం రాష్ట్రంలో టీడీపీ ఎన్డీయే కూటమి, మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి గెలుపు ఖాయమని మంత్రాలయం నియోజకవర్గంలో 84 శాతం ఓలింగ్ నమోదు కావడం పట్ల ప్రతిపక్ష పార్టీ టీడీపీకే అనుకూలమని టీడీపీ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో దలవాయి భీమయ్య, వడ్డె రామయ్య, ఉరుకుందు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు ఖాయం



తుగ్గలిలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, మే 13: రాష్ట్రంలో ప్రజలందరూ ఆశీర్వదించి సైకిల్ గుర్తుకు ఓటేశారని, భారీ మెజారిటీతో పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యేగా కేఈ శ్యాంబాబు గెలుపు ఖాయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి తిమ్మయ్య చౌదరి అన్నారు. మంగళవారం తుగ్గలిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు ప్రజలకు మద్యం, డబ్బులు ఎరవేసినా ప్రజలంతా టీడీపీ వైపే మొగ్గు చూపారని, తాలుకాలో అన్ని మండలాల్లో టీడీపీకి తుగ్గలి మండలంలో భారీ మెజారిటీ రావడం ఖాయమన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో వలస వెళ్లిన వారు కూడా తిరిగి గ్రామాలకు వచ్చి స్వచ్ఛందంగా వచ్చి టీడీపీకి ఓటు వేశారన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఆలోచనా శక్తితో టీడీపీకి ఓటు వేశారని, అభివృద్ధి సంక్షేమం చంద్రబాబుకు రెండు కళ్లు అని ప్రజలందరికీ అర్థమైందన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు వరలక్ష్మి, వరప్ప, సర్పంచ్ రవి, అల్లాబకాష్, పుల్లన్న, ఆకుల శ్రీనప్ప, వంశీ పాల్గొన్నారు.

రానున్నది టీడీపీ ప్రభుత్వమే

ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్



మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

ఆలూరు, మే 14: రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని, జరిగిన ఎన్నికల్లో ప్రజలు టీడీపీకే మొగ్గు చూపారని, ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. మంగళవారం ఆలూరు టీడీపీ కార్యాలయంలో టీడీపీ ముఖ్యనేతల సమావేశం, సీనియర్ నాయకులు తిమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. వీరభద్రగౌడ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో అన్ని వర్గాలకు లబ్ధిచేకూరేలా ఉందన్నారు. అందువల్లే ప్రజలు టీడీపీను ఆదరిస్తారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు అవుతాయన్నారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో వేదవతి, నగరడోణ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవడం వల్ల నిర్మాణం పనులు నిలిచిపోయయాన్నారు. దీంతో సాగునీరు, లేక పంటలు పండకపోవడంతో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల కోసం నెల రోజుల పాటు శ్రమించిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్‌లు రామ్‌నాథ్ యాదవ్, కురువ జయరాం, మండల కన్వీనర్ పరమారెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకులు మనేకుర్తి రాజశేఖర్, నారాయణ, డా. నెట్టెప్ప, తాలూకా నాయకులు బిల్లేకల్ వెంకటేష్, కృష్ణ యాదవ్, సాలీ సాహెబ్, నరసప్ప, సురేంద్ర, కొమ్ము రామంజి, నాగరాజు, నౌనేపాటి చౌదరి, ప్రకాష్, జిలానీ, మద్దిలేటి, ఎంపీటీసీ నరసన్న, రాముడు, మహేష్, గుండయ్య, మసాలా జగన్, గోవింద్ పాల్గొన్నారు.



వెంకటాపురం కాలనీలో 100, 101 పోలింగ్ బూత్‌లో క్యూలైన్‌లో నిలుచున్న మహిళా ఓటర్లు

రాత్రి వరకు కొనసాగిన పోలింగ్

ఎమ్మిగనూరు/రూరల్, మే 13: ఎమ్మిగనూరు పట్టణంలోని నాలుగు కేంద్రాలతో పాటు మండలంలోని కొన్ని గ్రామాల్లో సోమవారం జరిగిన ఓటింగ్ ప్రక్రియ పొద్దుపోయే వరకు కొనసాగింది. వాస్తవంగా ఉదయం 7గంటలకు ప్రారంభమై సాయంత్రం 6గంటల వరకు కొనసాగాల్సిన ఓటింగ్ కొన్ని కారణాల వల్ల రాత్రి 11గంటల వరకు కొనసాగింది. దీంతో ఓటర్లు కొంత ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా ఎమ్మిగనూరు పట్టణంలోని 143వ బూత్‌లో మొత్తం 1245 ఓట్లు ఉండగా 991 ఓట్లు పోలయ్యాయి. అలాగే 144వ బూత్‌లో 1357 ఉండగా 1073 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా దాదాపు 150 మంది రెండు బూత్‌ల్లో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉండి ఓటు వేశారు. దీనికి కారణం ఉదయం వర్షం కారణంగా పోలింగ్ ఆలస్యంగా మొదలు కావడంతో రాత్రి 10గంటల వరకు పోలింగ్ కొనసాగింది. వెంకటాపురం కాలనీలోని పోలింగ్ బూత్ నెంబర్ 100లో 1179, 101 కేంద్రంలో 1365 ఓట్లు ఉండగా సాయంత్రం ఆరుగంటల వరకు ఓటింగ్ ప్రక్రియ ముగియాల్సి ఉండగా రెండు బూత్‌లలో 310 మంది ఓటర్లు ఓటు వేయాల్సి ఉండడంతో రాత్రి 9గంటల వరకు పోలింగ్ జరిగింది. శివన్ననగర్‌లోని 131 పోలింగ్ బూత్‌లో మొత్తం 1390 ఓట్లు ఉండగా 1024 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ కూడా పోలింగ్ ముగిసే సమయానికి 200 మంది మిగిలి ఉండడంతో వారు రాత్రి 9గంటల వరకు పోలింగ్ కొనసాగింది. 132బూత్‌లో మొత్తం 980 ఓట్లు ఉండగా 827 ఓట్లు పోలయ్యాయి. ఈ పోలింగ్ బూత్‌లో కూడా పోలింగ్ ముగిసే సమయానికి 30మంది ఉండడంతో వారు 7గంటల వరకు ఓటు వేశారు. ఇలా పోలింగ్ ఆలస్యం కావడానికి వృద్ధులు, మహిళలకు ఓటింగ్‌పై అవగాహలేకపోవడం, పోలింగ్ సిబ్బంది ఓటు ప్రక్రియను నెమ్మదిగా జరపడంతో ఈ కేంద్రాల్లో ఆలస్యమైనట్లు తెలిసింది.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండలంలోని కొన్ని గ్రామాల్లో ఓటింగ్ ప్రక్రియ రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. దీంతో ఓటర్లు కొంత ఇబ్బందికి గురయ్యారు. ఇందుకు కారణం సోమవారం తెల్లవారు జాము నుంచి వర్షం పడడంతో పాటు ఈవీఎంలు కొన్నిచోట్ల మొరాయించాయి. అంతేగాక ఈవీఎంలు స్లోగా పనిచేయడంతో ఓటింగ్ ఆలస్యమైంది. మండలంలోని కొటేకల్లు గ్రామంలో 164, 165, 166బూత్‌లలో మొత్తం 2663 ఓట్లు ఉండగా 2236 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ రాత్రి 8గంటల వరకు పోలింగ్ జరిగింది. అలగే గుడికల్లు గ్రామంలో 177, 178, 179, 180, 181, 182, 183, 184, 185 బూత్‌లలో మొత్తం 8530 ఉండగా 6996 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ ఈవీఎంలు మొరాయించాయి. అలాగే ఎస్.నాగలాపురంలో బూత్ నెంబర్ 197లో మొత్తం 1332 ఓట్లు ఉండగా 1209 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ రాత్రి 10గంటల వరకు కొనసాగింది. ఇక్కడ ప్రధాన కారణం ఈవీఎంలు స్లోగా పనిచేయడం. ఇలా పోలింగ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో ఓటర్లు, అధికారులు ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది.

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ ,కుంకనూరు,కప్పట్రాళ్ల , గ్రామాలలో పోలింగ్ సమయం 6 దాటాక కూడా రాత్రి 9 గంటలకు వరకు పోలీంగ్ కోనసాగింది. కుంకనూరు గ్రామంలోని రెండు పోలింగ్ కేంద్రాలలో ఈవిఎంలు మొరాయించడంతో పాటు, సాయంత్రం వేళ ఓటు వేసేందుకు 4 గంటల నుండి ప్రజలు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లను అదుపు చేసేందుకు పోలీసులు లేకపోవడంతో ఓటర్లు చొచ్చుకుపోవడంతో పోలీంగ్ సిబ్బంది ప్రజలను అదుపు చేయలేక చేతులేత్తేశారు.దాంతో సమయం మించిపోయి రాత్రి వరకు పోలింగ్ జరిగింది.



దేవనకొండలో...



అలిగెరలో బారులు తీరిన ఓటర్లు

రాత్రి 9 గంటలకు ఓటేశారు..

మద్దికెర, మే 14: మద్దికెర గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలోని 33వ బూత్‌లో సోమవారం రాత్రి 9 గంటల వరకు ఓటర్లు ఓటు వేశారు. ఆ పోలింగ్ కేంద్రంలో మొత్తం 1300 ఓట్లు ఉండగా.. 1,040 ఓట్లు పోలయ్యాయి.. అయితే ఆ పోలింగ్ బూత్‌లో ఓట్లు ఎక్కువగా ఉండటమే కాకుండా వయోభారం మీద పడిన వృద్ధులు కూడా ఉండటం వల్ల పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైందని తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. రాత్రి 9 గంటల వరకు ఓటర్లు ఓటు వేసేందుకు ఉన్నారు. ఏదీ ఏమైనా మండలంలో ప్రశాంతంగా ఓట్లు జరిగాయి.

● మద్దికెర మండలంలోని 11 గ్రామాల్లో మొత్తం 34 పోలింగ్ కేంద్రాల్లో 29,592 ఓట్లు ఉండగా.. 24,744 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 83.6 శాతం పోలింగ్ నమోదైంది.

గోనెగండ్ల: మండలంలోని వేముగోడు గ్రామంలో బూత్‌నెం 219,220 లలో సోమవారం రాత్రి 9.30 గంటల వరకు పోలింగ్ సాగింది. దాదాపు 89 శాతం పోలింగ్ జరిగింది. 219 బూత్ 1260 ఓట్లు ఉందగా అందులో రాత్రి వరకు1120 ఓట్లు పోల్ ఆయ్యాయి. అలాగే 220 బూత్‌లో 1260 ఓట్లు ఉండగా అందులో 1115 ఓట్లు పోల్ అయ్యాయి. ఈవీఎంలు నిధానంగా పని చేయడం దీనికి తోడు సిబ్బంది కూడా స్లోగా పనిచేయడం కారణంగా రాత్రి 9.30 గంటల వరకు పోలింగ్ జరిగినట్లు రాజకీయ పార్టీ నాయకులు తెలుపు తున్నారు.

ఆస్పరిలో 82 శాతం పోలింగ్

ఆస్పరి, మే 14: 2024 సార్వత్రిక ఎన్నికలలో భాగంగా సోమవారం నిర్వహించిన ఎన్నికలలో ఆస్పరి మండలంలో 82% పోలింగ్ నమోదయింది. మండలంలో మొత్తం ఓటర్లు 52,821 మంది ఉండగా, 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 33 గ్రామాలలో 65 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగినట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు.

తుగ్గలి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని తహసీల్దార్ షర్మిళ అన్నారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 55 పోలింగ్ కేంద్రాల్లో 49,316 మందికి గానూ 42,275 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాదాపు 85.73 శాతం ఓటింగ్ పోల్ నమోదైందని, దాదాపు సోమవారం రాత్రి 8 గంటలకు ఓటింగ్ ప్రక్రియ పూర్తయిందని, ముక్కెళ్ల గ్రామంలో మాత్రమే రాత్రి 9 గంటల వరకు పోలింగ్ జరిగిందన్నారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించిన ఎస్ఐలు మల్లికార్జున, రామాంజనేయులు గట్టి బందోబస్తు నిర్వహించారన్నారు.

శాంతి హోమాలు



శాంతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మద్దికెర, మే 14: మద్దికెర గ్రామంలోని మద్దమ్మకుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో శాంతి హోమాలు నిర్వహించారు. మంగళవారం ఆలయ నిర్వాహకులు విజయప్రసాద్ ఆధ్వర్యంలో పురోహితులు నక్షత్ర దోషం, కుజ దోషం, రాహుకేతు నివారణ, ప్రత్యేక వి ద్యా వ్యాపార అభివృద్ధి శాంతి కోసం హోమాలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్ సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశా రు.

విజయం మనదే..

మద్దికెర, మే 14: మద్దికెర మండలంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవమే కాకుండా.. టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు విజయం తథ్యమని, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు దనుంజయుడు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలంలో జరిగిన ఓటింగ్ సరళిపై సమీక్ష నిర్వహిస్తున్నారు. వారు మాట్లాడుతూ ప్రజలందరూ టీడీపీ వైపే ఉన్నారన్నారు. మండలంలో పోలింగైన ఓట్లు చూస్తుంటే.. ఎక్కువ శాతం టీడీపీకే పోలయ్యాయని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు, కష్టపడిన ప్రతి ఒక్కరికీ టీడీపీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ, రంగయ్య, గడ్డం రామాంజులు, పారా విరోభ, శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

కోసిగిలో విద్యుత్ కోతలు



కోసిగిలో విద్యుత్ కోతలతో ఆయిల్ షాపు ముందు కూర్చున్న ప్రజలు

కోసిగి మే 14: కోసిగిలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ కోతలతో కోసిగి ప్రజలు అల్లాడిపోయారు. ఓ వైపు ఉక్కపోత, మరో వైపు కరెంటు కోతలతో ప్రజలు, గర్భిణులు, పిల్లలు అల్లాడిపోయారు. మంగళవారం కోసిగి సంత ఉండటంతో ఆయా గ్రామాల నుంచి వచ్చిన పల్లె ప్రజలు కరెంటు లేకపోవడంతో పిండి, కారం గిర్నిలు, ఆయిల్‌మిషన్ల షాపుల ముందు కరెంటు రాక కోసం గంటల తరబడి వేచి చూశారు. మంగళవారం ఒకే రోజులో చాలాసార్లు కరెంటు తీయడంతో విద్యుత్ అధికారులపై ప్రజలు, వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మార్పు, ఉద్యోగాల కోసమే...

ఎమ్మిగనూరు/టౌన్, మే 13: అభివృద్ధి, ఉద్యోగాల కల్పన జరగాలనే ఉద్దేశంతో ఓటింగ్ జరిగిందనే కొందరు పరిశీలకులు అంటున్నారు. అందుకే ఓటు వేసేందుకు బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లో ఉంటున్న యువత వారి సొంత ప్రాంతాలకు వచ్చి సోమవారం జరిగిన ఓటింగ్‌లో పాల్గొన్నారు. వారి అభిప్రాయాలు ఇలా..

మార్పు కోసం, అభివృద్ధి కోసం



రాష్ట్రంలో మార్పు రావాలనే ఆకాంక్షతోనే నేను ఎమ్మిగనూరుకు వచ్చి ఓటు వేశాను. రాష్ట్ర పరిస్థితులు చాలా దుర్భరంగా ఉన్నాయి. యువత, నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. చంద్రబాబు వస్తే ఉపాధి అవకాశాలతో పాటు అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావంతో ఓటు వేసేందుకు వచ్చాను.

- సాయి, ఎమ్మిగనూరు(బెంగళూరు)

ఉద్యోగాలు లేక ఇతర ప్రాంతాలకు వెళ్లకూడదనే



ఉద్యోగాలు లేక ఎంతో మంది నిరుద్యోగులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోంది. ఈ ఐదేళ్ల కాలంలో నిరుద్యోగ యువత ఆశించిన స్థాయిలో ఉద్యోగాల కల్పన జరగలేదు. దీంతో మాలాంటి వారు స్కిల్ ఉన్నప్పటికీ స్థానికంగా ఉపాధి లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీన్ని మార్చే నాయకుడు రావాలనే చెన్నై నుంచి వచ్చి ఓటు వేశాను.

-వెంకటేష్, ఎమ్మిగనూరు(చెన్నై)

ఓటింగ్‌పై ఇరు పార్టీల సమీక్షలు

● బూత్‌ల వారీగా వివరాల సేకరణ

ఎమ్మిగనూరు, మే 13: ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. దీంతో మంగళవారం ప్రధాన పార్టీల అభ్యర్థులు, నేతలు రిలాక్స్ అయ్యారు. సోమవారం నియోజకవర్గం వ్యాప్తంగా జరిగిన ఓటింగ్ సరళిపైన ఆయా పార్టీల నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో వివరాలు రాబట్టారు. నియోజకవర్గంలో 2,47,752 ఓట్లు ఉండగా 2,03,86 ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికల కంటే ఈ సారి దాదాపు 3శాతం ఓటింగ్ పెరిగింది. ఓటింగ్ సరళిపై టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి నియోజకవర్గంలోని నాయకులతోను, పోలింగ్ ఏజెంట్లతో సమీక్షించారు. ఎక్కడెక్కడ ఏ మేరకు ఓటింగ్ జరిగింది. ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపారు అనే వివరాలను తెలుసుకున్నారు. అలాగే ఆయా గ్రామాల్లో ఓటింగ్‌శాతం పెరిగిందా..తగ్గిందా అనే దానిపై కూడా ఆరా తీశారు. అలాగే పట్టణంలో కూడా ఏఏ బూత్‌లో ఏ మేరకు పోలింగ్ నమోదైంది అనే వివరాలను తెలుసుకున్నారు. అలాగే వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక సైతం పోలింగ్‌పై సమీక్షించారు. స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని కలిసి ఓటింగ్ సరళి, పోలైన ఓట్ల వివరాలు, ఏఏ గ్రామాల్లోను, పట్టణంలోని ఏఏ ప్రాంతంలోను ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపారో అన్న విషయాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. అలాగే పార్టీ కార్యాలయంలో నాయకులతో పోలింగ్ నమోదు, ఓటింగ్ సరళిపై సమీక్షించారు. ఇలా ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఎవరికి వారు తమ పార్టీ నాయకులు, ఏజెంట్లతో చర్చించి పోలింగ్‌పై ఒక అవగాహనకు వచ్చినట్లు తెలిసింది. అయితే ఎవరికివారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా అటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఇటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు మా అభ్యర్థి ఇన్నివేల మెజార్టీతో విజయం సాధిస్తారని ఎవరికి వారు చెప్పుకుంటున్నారు.

మంత్రాలయంలో..

మంత్రాలయం, మే 14: మంత్రాలయం నియోజకవర్గంలో గెలుపు ఓటములపై టీడీపీ కూటమి, వైసీపీ నాయకులు తమ ఇళ్ల ముందు ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలతో సమీక్షలు, ఓటింగ్ సరళి విశ్లేషణలతో బిజీగా గడిపారు. మంగళవారం మంత్రాలయం నియోజకవర్గం ఎన్నికలపై మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఆయా పార్టీల నాయకులు వేర్వేరుగా చర్చలు జరుపుకున్నారు. మాధవరంలో టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, రాంపురంలో వైసీపీ అభ్యర్థి బాలనాగిరెడ్డి తమ గెలుపు ఓటములపై సమీక్షించారు. మంత్రాలయం నియోజకవర్గంలో అత్యధికంగా 84.31 శాతం ఓటింగ్ నమోదు కావడంతో పెరిగిన ఓటింగ్ శాతం పై చర్చలు జరిగాయి. మంత్రాలయం నియోజకవర్గంలోని 4 మండలాల్లో 2,08,350 ఓట్లు ఉండగా.. ఇందులో పురుషులు 1,21,055 మంది కాగా, మహిళలు 1,06,172 మంది, ఇతరులు 23 మంది ఉండగా.. ఇందులో 1,75,667 మంది ఓటు హక్కును



టీడీపీ నాయకులతో పోలింగ్‌పై సమీక్ష నిర్వహిస్తున్న ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్

వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 87,808 మంది, మహిళలు 87,848 మంది, ఇతరులు 11 ఓటు హక్కు వినియోగించుకున్నట్లు నివేదికలు సిద్ధం చేసుకుని గ్రామాలు, పోలింగ్ బూత్‌ల వారిగా ఆయా గ్రామాలు, మండల స్థాయి నాయకులతో మెజారిటీలు లెక్కించుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఓటింగ్ సరళిని బట్టి తమ గెలుపు ఖాయమనే ధీమాలో ఇరు పార్టీల నేతలు తమ కార్యకర్తల ముందు ఎవరికి వారే గెలుస్తామన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు.


టీడీపీ నేతలతో పోలింగ్‌పై వీరభద్రగౌడ్ సమీక్ష

ఆలూరు, మే 14: జరిగిన పోలింగ్ పై మంగళవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ సమీక్ష నిర్వహించారు. ఆలూరు నియోజకవర్గంలో 6 మండలాల్లో గ్రామాల వారిగా ఏ ఏ బూత్‌లో ఎన్ని ఓట్లు పోలయ్యాయి... ఎంత మేర మెజారిటీ రాబోతుందనే విషయాల పై ఆయా మండల ముఖ్యనాయకులతో చర్చించారు. ముఖ్యంగా దేవనకొండ, ఆస్పరి మండలాల్లో అత్యధికంగా ఓట్లు ఉండటంతో ఆ గ్రామాల బూతుల వారిగా ఏజెంట్‌లు నమోదు చేసిన లెక్కలు అంచనా వేస్తూ, బిజిబిజీగా గడిపారు. నియోజకవర్గం నుంచి ముఖ్యనేతలతో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించారు. దీంతో టీడీపీ కార్యాలయం, కార్యకర్తలతో సందడిగా మారింది. కొందరు టీడీపీ నాయకులు వీరభద్రగౌడ్ నాయకత్వం వర్ధిల్లాలి... కాబోయే ఎమ్మెల్యే అంటూ నినాదాలు కూడా చేశారు. అందరి ఆశీర్వాదంతో టీడీపీ అధికారంలోకి వస్తే, ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు ఆయనను ఘనంగా సన్మానించారు.

కోసిగి ప్రజల్లో ఇంత మార్పా..?

● మండలంలో ప్రశాంతంగా ఓటింగ్ ప్రక్రియ

కోసిగి మే 14: కర్నూలు జిల్లాలో కోసిగి మండలం గొడవలకు పుట్టినిల్లు లాంటిదని పేరు. ఇప్పుడు కోసిగి మండలం ప్రశాంతతకు మారు పే రు గా మారిందని చెప్పవచ్చు. కోసిగి, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ ఎన్నికల్లో ఓటర్లలో వచ్చిన మార్పులు చూసి అధికారులే విస్తు పోతున్నారు. గతంలో కోసిగి మండలంలో ఏ ఎన్నికలు జరిగినా.. రక్తపాతాలు, ఘర్షణలు, ఒక వర్గం వారిపై మరోవర్గం దాడులు చేయడం, అధికారులను భయభ్రాంతులకు గురి చేయడం, ఏజెంట్లను భయపెట్టడం జరిగేది. 2004 సార్వత్రిక ఎన్నికల్లో అయితే.. కోసిగిలోని పలు బూత్‌ల దగ్గర పోలీసులు గాలుల్లో కాల్పులు జరిపారంటే.. నాటి పరిస్థితులు ఎంతగా భయానకంగా ఉన్నాయో తెలుస్తుంది. అప్పట్లో కోసిగి మండలంలో 50 శాతం మించి పోలింగ్ నమోదయ్యే పరిస్థితి లేదు. అలాంటిది కోసిగి మండలంలో 2024 ఎన్నికల్లో 85 శాతం పోలింగ్ కావడంతో పాటు గంటల కొద్ది క్యూలైన్లలో నిల్చుని ఎక్కడా ఎలాంటి చిన్న ఘటనలు కూడా చోటు చేసుకోకుండా ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. ఇది కోసిగి మండల ప్రజల్లో



మార్పును సూచిస్తోంది. ఇంత సైలెంటుగా ఓటింగ్ శాతం నమోదు కావడం దేనికి సంకేతమో.. ఇటు వైసీపీ, అటు టీడీపీ నాయకులు టెన్షన్‌తో తలపట్టుకున్నారు. ముఖ్యంగా కోసిగి మండలంలో అక్షరాస్యత శాతం పెరగడం, వ్యవసాయం, వ్యాపారం పెరగడం వల్ల ఈ మార్పు వచ్చిందని చర్చించుకొంటున్నారు.